అవశేషాలే మలి పంటలకు బలం

● దహనం చేయటం వల్ల నష్టాలే అధికం
● పర్యావరణానికి సైతం పెను విఘాతం

బాపట్ల టౌన్: పుడమిని నమ్ముకొని జీవనం సాగించే రైతులు భూమిని ప్రేమించినంతగా మరెవ్వరూ ప్రేమించలేరు. తమకు జీవనాధారమైన పంట పొలాలను నమ్ముకొని పంటలు సాగు చేసి, దిగుబడులను అమ్ముకొని కుటుంబాలను పోషించుకోవడం మాత్రమే వారికి తెలుసు. అయితే వాతావరణ మార్పులు, కూలీల కొరత, ప్రకృతి వైపరీత్యాలు.. వారి ఆలోచన విధానంలో కూడా మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు పంటల అవశేషాలను కలియదున్నడం ద్వారా ఎరువుగా మార్చుకొని సేంద్రియ వ్యవసాయ విధానం ద్వారా మంచి దిగుబడులు సాధించిన రైతులు.. ప్రస్తుతం అందుకు పూర్తి భిన్నంగా వాటిని దగ్ధం చేయటం ద్వారా పలు విధాలుగా నష్టపోతున్నారు. తెగుళ్ల అధికంగా ఆశిస్తుండటం, వాటి నివారణ కోసం రసాయన ఎరువులు విస్తారంగా వినియోగించడం వల్ల వాటిని కలియదున్నితే, ఆ దుష్ప్రభావం తదుపరి పంటలపై ఉంటుందనేది రైతుల భావన. తద్వారా వాటిని తగులబెడితే, తెగుళ్లకు కారణమయ్యే బ్యాక్టీరియా నశిస్తుందనే ఆలోచనలో ఉన్నారు. మరి కొందరు త్వరితగతిన మరో పంట వేసుకునేందుకు వీలుగా అవశేషాలను తగులబెడుతున్నారు. అయితే దీనివల్ల లాభం లేకపోగా, నష్టం అధికంగా ఉంటుందని వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులు హెచ్చరిస్తున్నారు.

నష్టమే అధికం

గతంలో పంట కాలం పూర్తయిన తర్వాత రైతులు పంటల అవశేషాలను అలాగే ఉంచేవారు. మళ్లీ సాగు తరుణంలో వాటిని కలియదున్నేవారు. అయితే ప్రస్తుతం అందుకు భిన్నంగా వాటి అవశేషాలను కాల్చేస్తున్నారు. వరి, పత్తి, మినుము, మొక్కజొన్న తదితర పంటల కాలం పూర్తయిన వెంటనే మరో పంట సాగు కోసం వాటి అవశేషాలను తగులబెట్టడం ఇటీవల పరిపాటిగా మారింది. ఈ ప్రక్రియ సులభమే అయినప్పటికీ, ఎటువంటి లాభం లేకపోగా నష్టం మాత్రం తీవ్రంగా ఉంటుందని వ్యవసాయ శాఖాధికారులు, పర్యావరణవేత్తలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పంటల అవశేషాలను దహనం చేయటం ద్వారా పర్యావరణానికి పెనువిఘాతం కలుగుతుందని, అదే విధంగా పంటలకు మేలుచేసే ఎర్రలు, ఇతర సూక్ష్మక్రిములు పూర్తిగా నశిస్తాయని, తద్వారా భూమి నిస్సారమవుతుందని, ఫలితంగా ఎంత పెట్టుబడులు పెట్టినా, ప్రయోజనం ఉండదని, అంతేకాక పర్యావరణానికి సైతం హాని కలిగించినట్లవుతుంది.



ముత్తాయపాలెంలో వరి పంట అవశేషాలను దహనం చేస్తున్న రైతులు

కలియదున్నితే ప్రయోజనం

అవశేషాలను తగులబెట్టడానికి బదులు భూమిలో మురగబెట్టి దుక్కిలో కలిపి దున్నడం ద్వారా ప్రయోజనం ఉంటుంది. వరి మొక్కను కింద వరకు కోసి గడ్డి కింద ఉపయోగించుకోవచ్చు. అవశేషాలను దుక్కిలో కలిపి దున్నడం ద్వారా సేంద్రియ కర్బనం పెరిగి పంటలకు మేలు చేకూరుతుంది. మల్చర్ యంత్రం ద్వారా పత్తి, మొక్కజొన్న పంటలను దున్నితే సత్వరం భూమిలో కలుస్తుంది. వరి పొలాల్లో రోటావేటర్ ద్వారా కలియదున్నితే పోషకాలు మొక్కకు అందుబాటులో ఉంటాయి.

భూమి నిస్సారమవుతుంది



పంటల అవశేషాలను దహనం చేయటం ద్వారా పర్యావరణానికి పెను విఘాతం కలుగుతుంది. పంటలకు మేలు చేసే ఎర్రలు, ఇతర సూక్ష్మక్రిములు పూర్తిగా నశిస్తాయి. దీంతో భూమి నిస్సారమవుతుంది. ఫలితంగా ఎంత పెట్టుబడులు పెట్టినా, ప్రయోజనం ఉండదు. అవశేషాలను తగులబెట్టడానికి బదులు దుక్కిలో కలిపి దున్నడం ద్వారా ప్రయోజనం ఉంటుంది. దీంతో సేంద్రియ కర్బనం పెరిగి పంటలకు మేలు చేకూరుతుంది.

– చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి

క్లుప్తంగా

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

రేపల్లె రూరల్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని నాలుగు పరీక్ష కేంద్రాలలో 1,708 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1,639 మంది హాజరై 69 మంది గైర్హాజరయ్యారు. ఆర్‌సీ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 545 మంది విద్యార్థులకు 22 మంది గైర్హాజరవ్వగా, జేఎల్‌బీ కళాశాలలో 413 మందికి 15 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 350 మందికి 14 మంది, చైతన్య కళాశాలలో 400 మందికి 18 మంది గైర్హాజరైనట్లు ఆయా సెంటర్‌ల సూపరింటెండెంట్‌లు తెలిపారు.

18 మంది విద్యార్థులు గైర్హాజరు



చెరుకుపల్లి: మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షకు 18 మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు సూపరింటెండెంట్‌లు హరికృష్ణ, బాబురావు, భారతిలు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 262 మంది విద్యార్థులకు గాను 8 మంది, గుళ్లపల్లి ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాలలో 163 మందికి గాను 8 మంది, గీతం కళాశాలలో 234 మందికి గాను ఇద్దరు గైర్హాజరయ్యారని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికునికి ఆర్థిక సాయం



నిజాంపట్నం: మండలంలోని హుస్సేన్‌నగర్ వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలో నివాసం ఉండే షేక్ సాధిక్ ఇటీవల భవన నిర్మాణ పని చేస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. దీంతో నిజాంపట్నం భవన నిర్మాణ కార్మిక సంఘం బాధిత కార్మికునికి శనివారం చేయూతనందించింది. సాధిక్‌కు యూనియన్ సభ్యులు రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్‌లో యూనియన్‌లో సభ్యులు ఎవరైనా ప్రమాదానికి గురైనా, ఇబ్బందులు పడుతున్నా యూనియన్ అండగా ఉంటుందని యూనియన్ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విశ్వంజీ జన్మదిన వేడుకలు ప్రారంభం



ప్రత్తిపాడు: విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ 81వ జన్మదిన వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధి చిన కోండ్రుపాడు విశ్వనగర్ లోని ఆలయాల్లో శనివారం ఉదయం విశ్వంజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య కల్పవృక్ష వరసిద్ధి వినాయకుడికి 108 కలశాలతో అభిషేకం చేశారు. అనంతరం విశ్వమానవ సమైక్యతా సంసత్ కన్వీనర్ ఆకుల కోటేశ్వరరావు, కామేశ్వరి దంపతులతో విశ్వంజీ పూజలు చేయించారు. విఘ్నేశ్వరునికి దివ్యహారతులిచ్చి మహా నైవేద్యం సమర్పించారు. సాయంత్రం కోలాట బృందం చేసిన కోలాట ప్రదర్శన అలరించింది. ఈ సందర్భంగా విశ్వంజీ మాట్లాడుతూ విశ్వ శాంతి కోసం ఆశ్రమంలో ప్రత్యేక హోమాలు, యాగాలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. విశ్వమంతా శాంతి సౌభ్రాతృత్వాలతో విరాజిల్లాలని ఆకాంక్షించారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి



పొన్నూరు: ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మండల ప్రత్యేక అధికారి ఓ.నరసింహారావు అన్నారు. శనివారం మండలంలోని ములుకుదురు, మాచవరం, చింతలపూడి గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. తొలుత పలువురు పింఛన్ దారులకు పింఛన్‌ను అందజేశారు. ఆయనతో పాటు ఈఓపీఆర్‌డీ మల్లికార్జునరావు పాల్గొని ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్త విభజన చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని తెలిపారు. స్వచ్ఛత కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందజేశారు. ప్రధాన కూడళ్లలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ప్రొక్లెయిన్‌తో ప్రధాన వీధుల్లో చెత్తను తొలగించారు. కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

మహిళాభ్యున్నతితోనే దేశాభివృద్ధి సాధ్యం



విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



సైకిలు ర్యాలీని ప్రారంభిస్తున్న సీడీపీవో సుచిత్ర

సీఐ మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళాభ్యున్నతితోనే దేశాభివృద్ధి సాధ్యమని పట్టణ సీఐ మల్లికార్జునరావు చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు పట్టణంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు మానసికంగా ఎంతో శక్తివంతులని, గృహంలో గానీ, ఉద్యోగ విధులలో గానీ, వ్యాపార రంగంలో గానీ బాధ్యతలను చక్కగా నిర్వహిస్తారనటంలో ఎటువంటి సందేహం లేదన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహిళలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థినులు తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. పాఠశాలలో, బయటా ఏమైనా సమస్యలు వస్తే నిర్భయంగా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని చెప్పారు. శిబిరంలో డాక్టర్ కృష్ణకుమారి వైద్య సేవలు అందించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గిరికుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో...

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆంధ్రరత్న మున్సిపల్ పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కిశోర ప్రాయంలో తలెత్తే ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమాజంలో ఉండాల్సిన నడవడికలు తదితర అంశాలపై సీడీపీవో ఎం.సుచిత్ర వివరించారు. విద్యార్థినులచే సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలింత మహిళలచే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రవీణ, సూపర్‌వైజర్‌లు శివజ్యోతి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలను జాతి మరువదు

ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ తోడేటి ఏసుపాదం

ప్రత్తిపాడు: ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఎస్సీ వర్గీకరణ కోసం వీరమరణం పొందిన అమరవీరులను మాదిగ జాతి ఎప్పటికీ మరిచిపోదని సంఘం నియోజకవర్గ కన్వీనర్ తోడేటి ఏసుపాదం అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు మండల పరిధిలోని యనమదలలో శనివారం మాదిగ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. పాలెపు శివయ్య మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఏసుపాదం అమరవీరుల ఫ్లెక్సీ వద్ద జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తోడేటి కృపారావు మాదిగ, తోడేటి ప్రభుదాస్ మాదిగ, గొడ్డుగోరు చిన్నబ్బాయి మాదిగ, తోడేటి జగదీష్ మాదిగ, తోడేటి బుల్లి మాదిగ, మన్నవ సురేష్ మాదిగ పాల్గొన్నారు.

ఆడపిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలి

ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు సీడీపీఓ సుజాతదేవి

ప్రత్తిపాడు: తల్లిదండ్రులు ఆడపిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు సీడీపీఓ వి.సుజాతదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలలో భాగంగా శనివారం మండల పరిధిలోని కోయవారిపాలెంలో ఆడపిల్లల జననాల వేడుకతో పాటు ఆడబిడ్డల పేరుతో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన సీడీపీఓ సుజాతదేవి ఆడపిల్లల తల్లులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడపిల్ల పుట్టిన వెంటనే ఒక మొక్కను నాటి, సంరక్షించాలన్నారు. ఆ మొక్క పెరిగి నీడనివ్వడంతో పాటు మంచి ఫలాలనిస్తాయని, అదే విధంగా ఆడ పిల్లను కూడా మంచిగా చదివించి ఉజ్వలంగా తీర్చిదిద్దేతే కుటుంబంతో పాటు సమాజం బాగుపడుతుందన్నారు. అడిషనల్ సీడీపీఓ విజయనిర్మల మాట్లాడుతూ ఆడపిల్లల సంరక్షణకు ఎన్నో చట్టాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు పి.మాధవి, ఎస్.భారతి పాల్గొన్నారు.



ఆడపిల్లల తల్లులకు మొక్కలు పంపిణీ చేస్తున్న సీడీపీఓ సుజాతదేవి, ఏసీడీపీఓ విజయనిర్మల

స్వచ్ఛంద సంస్థల సేవ భేష్

తెనాలిటౌన్: సేవా దృక్పథంతో స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆర్మీ లెఫ్ట్‌నెంట్ కల్నల్ జె.మహేష్ కొనియాడారు. కొలకలూరు గ్రామంలో డొనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన వైద్యశిబిరాన్ని లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. డాక్టర్ మాధవీలత వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. డాక్టర్ పూజిత మాట్లాడుతూ డొనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రభాకరరాజు జయంతి సందర్భంగా సేవ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని తెలిపారు. సంస్థ అధ్యక్షులు రాకేష్ మాట్లాడుతూ 2019లో ప్రారంభించిన సంస్థ ద్వారా ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలియజేశారు. వైద్య శిబిరంలో అవసరమైన వారికి మందులతోపాటు కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ ఆదర్శ్, అనుపమ్, రోహిత్, రాజ్‌కుమార్, వినయ్‌కుమార్, రవికిరణ్; వెంకటేశ్వరరావు, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కల్నల్ మహేష్

అసిస్టెంట్ ప్రొఫెసర్ వీరభద్రాచారికి పీహెచ్‌డీ



చేబ్రోలు: మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గాదె వీరభద్రాచారికి పీహెచ్‌డీ పట్టా అందజేసినట్లు వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ శనివారం తెలిపారు. 'డెవలప్‌మెంట్ ఆఫ్ లీస్ట్ స్క్వేర్స్ రెగ్రేషన్ బేస్డ్ ఏఎల్‌వో టెక్నిక్ ఫర్ ద బెస్ట్ ఆప్టిమల్ సొల్యూషన్ ఆఫ్ ఓఆర్‌పీడీ అండ్ ఈఎల్‌డీ ప్రాబ్లమ్స్ ఇన్ పవర్ సిస్టమ్స్' అనే అంశంపై వీరభద్రాచారి పరిశోధన చేశారని వివరించారు. పరిశోధనలో భాగంగా మొత్తం ఎస్‌సీఐ-2, స్కోపస్ జర్నల్స్-1, ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లు 2 ప్రచురించారని తెలిపారు. పీహెచ్‌డీ పొందిన వీరభద్రాచారిని పలువురు అభినందించారు.

కరాటేలో సెయింట్ థామస్ విద్యార్థుల ప్రతిభ

పొన్నూరు: పట్టణంలోని సెయింట్ థామస్ కేరళ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు చిలకలూరిపేటలో నిర్వహించిన ఆల్ ఇండియా కరాటే-డో చాంపియన్ షిప్ 2025లో తమ ప్రతిభ పురస్కారాలు పొందారు. సౌమ్య మొదటి బహుమతి సాధించి చాంపియన్ ట్రోఫీ దక్కించుకుంది. లిలి శరణ్య రెండో బహుమతి సాధించి రన్నర్ అప్ అవార్డు, ప్రియాంక, ఫర్హాన్, రయాన్, జాహ్నవి మూడో బహుమతి సాధించి అచీవ్‌మెంట్ ట్రోఫీలను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయిని రోజ్ థామస్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. విజేతలతో పాటు కరాటే శిక్షకులు ఉమా మహేశ్వరరావును అభినందించారు.

బైక్‌లు నడిపే వారు తప్పక హెల్మెట్ ధరించాలి

పెదకాకాని: బైక్‌లు నడిపేవారందరూ తప్పక హెల్మెట్ ధరించాలని పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి శనివారం కోరారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ లేనట్టయితే ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా ముందు వెనక కూర్చున్న వారు హెల్మెట్ ధరించాలన్నారు. కారు నడిపే వారు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని కోరారు. రోజు ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనం నడపాలని, కచ్చితంగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా వాహనాలు నడిపేవారు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారని తద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని హెచ్చరించారు.

పార్కును పరిశుభ్రంగా ఉంచండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పార్కులను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. చినరావూరులోని సత్యనారాయణ పార్కును శనివారం ఆయన పరిశీలించారు. సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత మిత్ర పథకం ద్వారా సిబ్బందికి వేతనాలు చెల్లించినట్టు పేర్కొన్నారు. ప్రజలకు ఆహ్లాదాన్ని అందిచే విషయంలో ఎక్కడా లోపాలు లేకుండా చూడాలన్నారు. పార్కులో సంచరిస్తూ ఆవరణలో ఎటువంటి వ్యర్థాలు వేయకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంతఈ ఆకుల శ్రీనివాసరావు, హార్టికల్చర్ ఆఫీసర్ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు

రేపల్లె కార్మిక శాఖ అధికారి ప్రభాకరరావు

రేపల్లె రూరల్: బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని రేపల్లె కార్మిక శాఖ అధికారి జి.ప్రభాకరరావు చెప్పారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 18 సంవత్సరాలలోపు బాలబాలికలను పనిలో పెట్టుకోరాదన్నారు. పనిలో పెట్టుకుంటే యజమానులకు రూ.1లక్ష అపరాధ రుసుము విధించటంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. రేపల్లె సెక్టారు పరిధిలోని ఏడు మండలాల్లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందాలంటే భవన నిర్మాణ కార్మికులు ఈ-శ్రమ్ కార్డులు తప్పనిసరిగా పొందాలన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులతో పాటు ఎన్ఆర్ఈజీఎస్ పథకంలోని కూలీలు ఈ-శ్రమ్ కార్డులు పొందేందుకు అర్హులేనని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రేపల్లె కార్మిక శాఖ సెక్టారు పరిధిలోని 7 మండలాల్లో 2,79,351 మంది ఈ-శ్రమ్ కార్డులు పొందలేదని సర్వేలో గుర్తించామన్నారు. కార్మికులు పేర్లు నమోదు చేసుకుని ఉచితంగా కార్డులు పొందవచ్చన్నారు. నెలకు రూ.15 వేలు ఆదాయంలోపు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ-శ్రమ్ కార్డు పొందేందుకు అర్హులన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కూలీలతో పాటు భవన నిర్మాణ రంగంలోని 42 వృత్తుల వారు ఈ కార్డులు పొందాలని తెలియజేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామ స్థాయిలో అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ కార్డులు పొందేలా సహకరించాలని ఆయన కోరారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ప్రయోగాలు దోహదం

ఎంఈవో వీరాంజనేయరావు

నగరం: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ప్రయోగాలు దోహదపడతాయని ఎంఈవో వీరాంజనేయరావు చెప్పారు.స్థానిక ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎంఈవో పరిశీలించి మాట్లాడారు. సైన్స్ ప్రయోగాలు చేయడం వల్ల విద్యార్థులలో ఆలోచన శక్తి పెంపొందుతుందన్నారు. విద్యార్థి దశ నుంచి నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. ఆ దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ యోనాబాబు, ప్రిన్సిపాల్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సైన్స్ ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంఈవో వీరాంజనేయరావు

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

అమర్తలూరు(వేమూరు): సైన్సులో విద్యార్థులు ప్రయోగాలు చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.నిరీక్షణరావు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్సు ప్రయోగాలలో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్సు దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాలలో సైన్సు ప్రయోగాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ప్రయోగాలలో విజేతలకు బహుమతులు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సైన్సు ఉపాధ్యాయులు ఆదినారాయణ, ఆనంద్, డి.శ్రీనివాసరరావు, మధు, రవితేజ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం నిరీక్షణరావు

బాలికలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

వేమూరు: బాలికలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇందిర ప్రియదర్శిని చెప్పారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం బాలికలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మహిళ దినోత్సవ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతోందని ఆమె తెలిపారు. బాలికల ఆరోగ్య పరిస్థితులు గమనించి మందులు ఇవ్వడం జరిగిందని అన్నారు. బాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎస్ఐ రవికృష్ణ మాట్లాడుతూ బాలికలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. తమ దృష్టికి తీసుకొస్తే బాలికల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, హెడ్ నర్సు పద్మావతి, మహిళ కానిస్టేబుల్ పాల్గొన్నారు.



వివా ఐబీ విద్యార్థుల పీవైపీ ఎక్స్‌పో

పెదకాకాని: వివా ది స్కూల్‌లో ఇంటర్నేషనల్ బాకలారియేట్ పీవైపీ (ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్) శనివారం నిర్వహించారు. ఐదో తరగతి విద్యార్థులు తరగతి గదిలో అభ్యసించిన అంశాలపై అవగాహన, సృజనాత్మకత, నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఏర్పాటు చేసిన ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్ ఎక్స్‌పో (పి.వై.పి.ఎక్స్‌పో) విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఐబీ విద్యా విధానం ద్వారా వారు అభ్యసించిన విద్యా, విద్యేతర అంశాలలో ప్రావీణ్యం సాధించిన నైపుణ్యాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో ప్రదర్శించారు. షేరింగ్ ది ప్లానెట్ అంటూ ఉపాధ్యాయులు అందించిన నేపథ్య అంశంపై విద్యార్థులు వాతావరణ చర్య, నీటి సంరక్షణ, జంతు సంరక్షణ, ఆహారం-ఆకలి వంటి అంశాలపై రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఇటీవల కాలంలో విద్యార్థులు సందర్శించిన పర్యాటక ప్రాంతాలు, వాటి విశిష్టతను తెలియజేస్తూ రాసిన వ్యాసాలు, ఫొటోలు ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని సందర్శించిన తల్లిదండ్రులు విద్యార్థుల ప్రగతిని వీక్షించారు. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎలిటి కమాండర్ కేఎస్ రావు, ప్రిన్సిపాల్ సి.హెచ్.సరళ, ఐబీ సమన్వయకర్త కె.మాధవి పాల్గొన్నారు.



నంబూరు వివా ది స్కూల్‌లో జరిగిన పీవైపీలో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

తెనాలిఅర్బన్: ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అసువులుబాసిన అమర వీరులను స్మరించుకోవాల్సిన అవసరం మాదిగ జాతిపై ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు చిలకా కిరణ్ మాదిగ, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు సొపాటి కిరణ్ పేర్కొన్నారు. మాదిగ అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని చెంచుపేట ఇందిరా నగర్‌లోని డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద శనివారం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనలో వారు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందరికి అందిననాడే వారికి నిజమైన నివాళి అని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలోని ముఖ్యమంత్రులు, ఎస్సీ వర్గీకరణ జరిగే విధంగా చర్యలు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ నాయకులు బి.ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు తంగిరాల మరియదాసు, కొక్కిలిగడ్డ మనోజ్, పినపాటి రత్నరాజు, గాజులవర్తి సురేష్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న చిలకా కిరణ్, సొపాటి కిరణ్ తదితరులు